ఘనంగా సర్వాయి పాపన్న జయంతి


పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: మొఘల్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి 31 కోటలను జయించిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 373వ, జయంతి సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, గౌడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బీ శ్రీనివాస్‌గౌడ్‌లు, ప్రజా, కుల సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని కులాలను ఏకం చేసి దళిత బహుజనుల హక్కుల కోసం పోరాడిన వీరుడని పేర్కొన్నారు. పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని 2022 అక్టోబర్ 30న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో పాపన్న జీవిత చరిత్రను చేర్చాలని డిమాండ్ చేశారు. వనపర్తిలో పాలిటెక్నిక్ కళాశాల ఎదుట పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతించడం హర్షించదగ్గ విషయమని, మంత్రి నిరంజన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాజీవ్‌చౌక్‌లో సైతం పలు సంఘాల ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జ యంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, బీసీ వెల్ఫేర్ అధికారి బీరం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పాన్‌గల్: బహుజన పోరాట యోధుడు సర్దార్ పాపన్నగౌడ్ జయంతిని మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. గోల్కొండ కోటను స్వాధీనం చేసుకున్న పోరాట యోధుడన్నారు. సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ హైమావతి, గౌడ సంఘం నాయకులు గంగాధర్‌గౌడు, కుమార్‌గౌడు, రవీందర్‌గౌడు, మధన్ మోహన్‌గౌడు, రాజాగౌడు, వినోద్‌గౌడు, బాలరాజుగౌడు, నరేందర్‌గౌడు, రాఘవేందర్‌గౌడు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలో శుక్రవారం ప్రజా ప్రతినిధులు, అధికారులు సర్వాయిపాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ నర్సింహారెడ్డి, గౌడ సంఘం నాయకులు బిచ్చయ్యగౌడ్, వెంకటయ్య, వెంకన్నగౌడ్, బస్వరాజ్‌గౌడ్, రాంబాబుగౌడ్, సుధాకర్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు కర్ణాకర్‌రెడ్డి, నాగులు, బాలరాజు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు చిన్న అంజనేయులుగౌడు ఆధ్వర్యంలో బస్టాండు వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమానికి ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యులు సామ్యనాయక్, మండల సింగిల్‌విండో చైర్మన్ మురళీదర్‌రెడ్డి , ఇరిగేషన్ డీఈ సత్యనారాయణగౌడులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ఓ విప్లవ వీరుడు జన్మించడం మనందరికి గర్వకారణమన్నారు. ఆయనను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరవరన్నారు. కార్యక్రమంలో ఖిల్లాఘనపురం సర్పంచ్ వెంకటరమణ, షాపురం సర్పంచ్ బాలాంజనేయులుగౌడు, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ళ కృష్ణయ్య, నాయకులు పాల్గొన్నారు.

అమరచింత: పట్టణంలోని గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జ యంతిలో మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ మా ట్లాడారు. గీత కార్మికులకు ఆరాధ్యుడైన సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు అశోక్‌గౌడ్, లచ్చన్నగౌడ్, నర్సింహులుగౌడ్, గోపాల్ గౌడ్, అక్కల నర్సింహులుగౌడ్, కేశవులు గౌడ్, శ్రీకాంత్ గౌడ్, చిన్నరాజు గౌడ్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పట్టణంలోని స్థానిక సుభాష్ చౌరస్తాలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మాట్లాడారు. అక్కి శ్రీనివాస్‌గౌడ్, పార్వతి, మహేందర్‌గౌడ్, జ్యోతి, అనుష, సురేందర్‌గౌడ్, బసవరాజుగౌడ్, మోహన్‌గౌడ్, రంగస్వామిగౌడ్, గుండ్రాతి రాకేష్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, నిఖిల్‌గౌడ్ పాల్గొన్నారు.

కొత్తకోట: బహుజన పక్షపాతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వామన్‌గౌడ్ మాట్లాడుతూ బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని అన్నారు. కార్యక్రమంలో నర్సింహాగౌడ్, తిరుపతన్నగౌడ్, శేఖర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్ వెంకటన్నగౌడ్ చక్రవర్తిగౌడ్, దేవిగౌడ్, రాఘవేంద్రగౌడ్ ఉన్నారు.


పాన్‌గల్‌లో..


వీపనగండ్లలో..


ఖిల్లాఘనపురం బస్టాండులో..

ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన జిల్లా అధికారిణి


వసతి గృహంలో బాత్‌రూం పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారిణి

సాక్షి ఎఫెక్ట్..

పాన్‌గల్: సమస్యల్లో 'వసతి గృహాలు' అనే శీర్షికతో సాక్షి దినపత్రిలో వచ్చిన కథనానికి స్పందించి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను శుక్రవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి నుషిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వసతి గృహంలో గదులను, వంటి గది, బాత్‌రూంలు, ఆవరణను పరిశీలించి సమస్యలపై వార్డెన్‌తో ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీని ఎంపీపీ నిధులతో పూర్తి చేయిస్తామన్నారు. కోతులు రాకుండా ఇనుప జాలీలు ఏర్పాటు చేయిస్తామన్నారు. కాస్మొటిక్ చార్జీలు మంజూరు కాగానే విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఆమె వెంట హాస్టల్ వార్డెన్ ఆంజనేయులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో రాయికంటి ఎల్లమ్మ దేవాలయం ఎదురుగా నిర్మించనున్న పోచమ్మతల్లి నూతన దేవాలయ నిర్మాణానికి సింగిల్‌విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి శుక్రవారం రూ.50 వేళ విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, శంకర్, లక్ష్మారెడ్డి, బాబు, మధు, రజినీకాంత్, బుచ్చిరెడ్డి, రామకృష్ణ, వెంకటేష్, బెస్త నారాయణ, బాల్‌రాజు, నర్సింహారెడ్డి, మేఘారెడ్డి, శ్రీను, రవి, వడ్డెస్వామి, మల్లేష్, శ్రీరాములు, గౌస్, లింగస్వామి పాల్గొన్నారు.

పాఠశాలలకు రాగిపిండి, బెల్లం పంపిణీ

పాన్‌గల్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో రాగిపిండి, బెల్లం ప్యాకెట్లను ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు పీఎం పోషణ్ కార్యక్రమంలో భాగంగా రాగిజావ అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి 10 గ్రాముల రాగిపోడి, 10 గ్రాముల బెల్లం పొడితో రాగిజావ అందించాలన్నారు. అనంతరం వంట ఏజెన్సీ మహిళలకు మంజూరైన చీరలను అందజేశారు. సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన ఆరెకటికలు

వీపనగండ్ల: రాష్ట్ర ఆరెకటిక అభివృద్ధి సంఘం హైదరాబాద్‌లో ఇందిరాపార్కు చేపట్టిన మహాధర్నాకు శుక్రవారం మండల కేంద్రం నుంచి ఆరెకటిక సంఘం నాయకులు తరలివెళ్లారు. ఎక్సైజ్ టెండర్లలో ఆరెకటికలకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఆరెకటిక కులాన్ని బీసీ డీ నుంచి బీసీ ఏ జాబితాలోకి మార్చాలని కోరారు. వందశాతం సబ్సిడీతో ఆరెకటికలకు మటన్ షాపుల నిర్వహణ కోసం రుణాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో శివాజీ, బాలాజీ, రాఘవేంద్ర, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, శ్రీనివాసులు, శంకర్‌జీ పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

పాన్‌గల్: మండలంలోని చింతకుంటలో శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాసులు మాట్లాడారు. నియోజకవర్గంలో రాచరిక పాలన కొనసాగుతుందని ఈ పాలనకు ముగింపు పలికేందుకు బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణనాయుడు, ఆనంద్, ఆశయ్య, చంద్రయ్య, సుధాకర్, సత్యానారాయణ, కృష్ణ, జగదీశ్‌గౌడు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బిల్ కలెక్టర్‌కు సన్మానం

పెబ్బేరు రూరల్: పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో పని చేస్తున్న ఉత్తమ బిల్ కలెక్టర్ శంకరయ్యను శుక్రవారం మిత్ర బృందం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఆదాయ పన్ను సకాలంలో 100 శాతం వసూలు చేసినందుకు ఉత్తమ బిల్ కలెక్టర్‌గా గుర్తించి స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్, ఎస్పీ రక్షిత మూర్తిలతో శంకరయ్య ప్రశంసాపత్రం అందుకున్నారు. దీంతో మిత్ర బృందం, పలువురు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానిస్తున్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, గంగాధర్, శిరీష, ఈశ్వర్‌యాదవ్, శేఖర్ పాల్గొన్నారు.

సంకల్ప సభను విజయవంతం చేద్దాం

ఆత్మకూర్: తెలంగాణ రాష్ట్రంలోని ముస్లింలకు న్యాయం చేసేంత వరకు పోరాటం చేస్తామని, ముస్లింలందరు ఏకం కావాలని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మస్‌జిదే ఆజంజాహీలో ముస్లిం మతపెద్దలు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముస్లిం డిక్లరేషన్ ఆవిష్కరణ సంకల్పసభను ఈనెల 20వ తేదీన ఆత్మకూర్‌లోని ఎంజీ గార్డెన్ ఫంక్షన్‌హాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంకల్ప సభకు ముఖ్యఅతిథిగా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ముఖ్యవక్తలుగా జాక్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ సలీంపాష, రచయిత స్కైబాబ, యూనస్ పర్వేజ్, షేఖ్‌హనీఫ్, సయ్యద్‌నవాజ్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో గయాసుద్దీన్, అబ్దుల్‌గని, షబ్బీర్, యూసుఫ్, హాఫీజ్ ముక్తదీర్, హాఫీజ్ ఫహీమ్, షాహిద్, కళీం పాల్గొన్నారు.

హాస్టళ్లలో వసతులు మెరుగు పర్చాలి

వీపనగండ్ల: సంక్షేమ హాస్టళ్లలో వెంటనే సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ సభ్యులు కోరారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ల సంరక్షణ కోసం చేపట్టిన జీపు యాత్ర శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌కు చేరింది. హాస్టల్లో ఇతర గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. కనీస వసతులు కల్పించి, మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జి ల్లా అధ్యక్షుడు ఎం ఆది, మల్లేష్ , ఈశ్వర్, మ హేష్, వంశీ, ప్రసాద్, చరణ్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూర్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలని, చేతకాకపోతే అధికారులు రాజీనామా చేసి వెళ్లిపోవాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారుల పనితీరుపై ధ్వజమెత్తారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి చేస్తే, బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నట్లు తూంపల్లి సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. నిధులున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమకు బిల్లులు ఇప్పించాలని అభ్యర్థించారు. సాగునీరు సరఫరాలో జూరాల ప్రాజెక్టు అధికారులు నిర్లక్ష్యం వల్ల గత సీజన్‌లో పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. పనులు చేయడం చేతకాకపోతే ఉద్యోగానికి రాజీనామ చేసి వెళ్లిపోవాలని ప్రభుత్వ ఉద్యోగులకు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని ఆయా శాఖల అధికారులు హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. సాగునీరు, వైద్యం, విద్య, వ్యవసాయం, పౌరసరఫరాలు, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, ఉపాధి, తదితర శాఖల ప్రగతి నివేదికలు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ డాక్టర్ శివరంజని, వైస్‌ఎంపీపీ కోటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ మహబూబ్‌పాష, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

మొక్కలకు నీటిని అందించాలి



పెబ్బేరు రూరల్: హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ సుదర్శన్ అన్నారు. చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వనపర్తి మడలంలోని చిన్నగుంటపల్లి ప్రధాన రహదారికి ఇరువైపుల నాటిన మొక్కలకు నీటిని పోశారు. అనంతరం ఆయన గృహలక్ష్మి దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

వర్గీకరణకు విద్యార్థులు మద్దతివ్వాలి


విశ్వరూప మహాసభ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

వీపనగండ్ల: ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం ఉద్యమంలో విద్యార్థులు కలిసి రావాలని జిల్లా ఎంఎస్ఎఫ్ కన్వీనర్ మల్కంపల్లి పరుశరాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో వర్గీకరణ సాధన కోసం ఆగస్టు రెండో వారంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభలకు విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎంఎస్ఎఫ్ కాలేజీ కమిటీ ఏర్పాటు

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కళాశాలలో కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షులుగా రాజు, శిరీష, ఉపాధ్యక్షులుగా రాజేశ్వరి, ప్రదీప్, అధికార ప్రతినిధులుగా శివ, మేఘన, ప్రధాన కార్యదర్శులుగా అనిత, శివశంకర్, కార్యదర్శులుగా రాజేశ్, అక్షయ్, కోశాధికా రులుగా భవాని, రాజు, కార్యవర్గ సభ్యులుగా కర్ణాకర్, చందు, మహేష్, ఉషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రెండో ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి


సమ్మెలో మాట్లాడుతున్న మోష

పెబ్బేరు రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా 16 ఏళ్లగా పని చేస్తున్న సుమారు 6వేల మంది రెండో ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష డిమాండ్ చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణలో రెండో ఏఎన్ఎంల సమ్మె మూడో రోజుకు చేరింది. రెండో ఏఎన్ఎంలు బొడ్డెమ్మలు ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీరాం, రమేష్, లక్ష్మి, ఏఎన్ఎంల సంఘం నాయకులు కృష్ణవేణి, లక్ష్మమ్మ, సుమిత్ర, పార్వతి, రాధ, శ్రీదేవి, శారద, లావణ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటం

అమరచింత: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుందని ఏబీవీపీ మండల కన్వీనర్ అఖిల్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికలు, జెడ్పీఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కో కన్వీనర్ రాజేష్, రవి వర్మ, భరత్, ప్రశాంత్, సందీప్ పాల్గొన్నారు.

రహదారులపై వృథాగా మిషన్ భగీరథ నీరు


అమరచింతలో రహదారిపై నిలిచిన మిషన్ భగీరథ నీరు

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలోని ఓవర్ హెడ్ ట్యాంక్ నిండి, వాటి మోటర్లను బంద్ చేయక పోవడంతో నీరు వృథాగా రహదారిపై పారుతోంది. మిషన్ భగీరథ సిబ్బంది తాగు నీటి ట్యాంకుల పర్యావేక్షణలో నిర్లక్ష్యం వల్లే తాగునీరు రోడ్డుపాలవుతోంది. సంబంధిత వాటర్ గ్రిడ్ అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాధితునికి ఎల్ఓసీ అందజేత



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లికి చెందిన బోరెల్లి ఎల్లయ్య కొంత కాలంగా అనారోగ్యంతో నీమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన చికిత్స ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. స్పందించిన వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఎల్ఓసీ మంజూరు చేయించారు. మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీని శుక్రవారం హైదరాబాద్ మంత్రుల సముదాయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

రేవంత్‌రెడ్డికి భద్రత పెంచాలి


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

వనపర్తిటౌన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి భద్రత సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం తగ్గించడం అప్రజాస్వామికమని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి భద్రత సిబ్బందిని తగ్గించడం సరికాదని, ఆయనకు ఏదైనా జరిగితే రాష్ట్ర కుటుంబానికి వర్తిస్తుందని, తర్వాత కాంగ్రెస్ చేపట్టే కార్యక్రమాలకు బీఆర్ఎస్ తట్టుకోలేదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డికి వెంటనే 4+4 సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్వతాలు, పెబ్బేర్ మండల అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు రాములు యాదవ్, రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు, పెద్దమందడి మండల అధ్యక్షుడు పెంటన్న, ఖిల్లాగణపురం మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డికి ఘన నివాళి

అమరచింత: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి జయంతిని శుక్రవారం మండల కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వ ఆస్పత్రి, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు మోదీ మనోహర్ రాజు మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంతో పాటు అప్పటి అమరచింత నియోజక వర్గం అభివృద్ధికి దయాకర్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనలో అందరు ముందుకు సాగాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, అబ్రహం, పోసిరిగారి గోపి, బాలరాజ్, కమ్రుద్దీన్, చాకలి నారాయణ, సవరన్న పాల్గొన్నారు.

డప్పు కళాకారుల కమిటీ ఏర్పాటు


సభ్యులను అభినందిస్తున్న రాష్ట్ర కమిటీ నాయకులు

ఖిల్లాఘనపురం: మండలంలోని వెంకటాంపల్లి డప్పుకళాకారుల నూతన కమిటీని శుక్రవారం రాష్ట్ర డప్పుకళాకారుల సంఘం అధ్యక్షుడు మైబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మిద్దె పెద్ద ఆంజనేయులు, అధ్యక్షుడిగా మిద్దె పెద్ద వెంకట్రాములు, ఉపాధ్యక్షులుగా మిద్దె చిన్నవెంకట్రాములు, శంకర్‌రాములు, ప్రధాన కార్యదర్శిగా తిమ్మని యాదయ్య, సహాయ కార్యదర్శిగా తిమ్మని నర్సింహ, కోశాధికారిగా మిద్దె యాదగిరి, సలహాదారులుగా వెంకటనర్సింహ, బాల్‌నాగయ్య తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి గడ్డం బాలయ్య, ఖిల్లాఘనపురం మండల నాయకులు కుర్మయ్య పాల్గొన్నారు.

బాబ్బాబు.. నాపేరుందో చూడండయ్యా..


అమరచింత యూనియన్ బ్యాంక్ వద్ద రుణమాఫి జాబితా చూసుకుంటున్న రైతులు

అమరచింత: ఈ ఫొటో చూస్తుంటే ఏదో పరీక్ష రాసిన తర్వాత ఉత్తీర్ణత సాధించామా.. తమ నంబర్ అందులో ఉందా! లేదా! అన్నట్లుగా ఆయా కళాశాలలో, పాఠశాలలో ఇలాంటి దృశ్యం చూస్తుంటాం. అలాంటిది చిత్రం కాదు ఇది. రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ ప్రకటించడంతో అర్హులకు సంబంధించిన లిస్ట్. అమరచింత యూనియన్ బ్యాంక్‌లో అమరచింత, నర్వ మండలాలకు చెందిన ఏడు వేల మంది రైతులు వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. అందులో కేవలం 12 వందల మంది రైతులు మాత్రమే ఇందుకు అర్హులని ప్రకటించారు. అర్హులైన రైతుల పేర్లను బ్యాంకు సిబ్బంది నోటీసు బోర్డుపై పెట్టడంతో తమ పేర్లు అందులో ఉన్నాయో.. లేదోనని చూస్తూ, మరోమారు చూడమంటూ రైతులు బ్యాంక్ దగ్గర గుమికూడారు.

కనులపండువగా గోదారంగనాథుని రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు, చిన్నారులు

పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం మండల కేంద్రంలోని గోదాదేవి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండో రోజు హోమం, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు గోదాదేవి, రంగనాథస్వామి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు రథానికి పూజలు చేసి కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం ఆలయం నుంచి గోవింద నామస్మరణతో భక్తులు, చిన్నారులు రథాన్ని ముందుకు లాగారు. కార్యక్రమంలో అర్చక స్వాములు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.